క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామంలో గల ఎస్సీ కాలనీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మేకల నాగేశ్వరరావు, కందుల వెంకటేశ్వర్లు, చనగాని సాంబయ్య, జంగం వెంకటేశ్వర్లు, వీసాల వెంకటేశ్వర్లు, ఎలుగురి నరసింహారావు, సోమయ్య, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

గణితం మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేసిన ఎంఈఓ

హుజూర్‌నగర్‌రూరల్ : పదవ తరగతి విద్యార్థులకు గణితానికి సంబంధించిన అన్ని అంశాలు సులభంగా అర్థమయ్యేలా కరదీపికలను (గణితం మెటీరియల్) రూపొందించడం అభినందనీయమని ఎంఈఓ భూక్యా సైదానాయక్ అన్నారు. బుధవారం కరక్కాయలగూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు నరేష్ అందించిన గణితం మెటీరియల్‌ను హెచ్ఎం బొల్లం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

కోదాడరూరల్ : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటో, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. ఆటోల్లో టేపురికార్డులు పెట్టవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొవద్దని, ఇష్టానుసారంగా రోడ్డుపై వాహనాలను నిలపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

దళిత జాతికి గౌరవం దక్కింది



మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గరిడేపల్లి : పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మంద కృష్ణకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు ఇవ్వడం దళిత జాతికి దక్కిన గౌరవం అని అన్నారు. కార్యక్రమంలో భీమపంగు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంద భిక్షం, దేవాదానం, బాటసారి, పిట్ట పిచ్చయ్య, కీసర నాగయ్య, మన్సూర్‌అలీ, అమరారపు అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాలు, బొడ్రాయి వార్షికోత్సవం



గ్రామ దేవతల పూజలో పాల్గొన్న గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెంలో గ్రామ దేవతలు ముత్యాలమ్మ, ఎల్లమ్మ దేవాలయాలు, బొడ్రాయి ప్రతిష్ఠించి 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం వార్షికోత్సవాన్ని గిరిజనులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు, పాట్టేళ్లతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలు, బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, మాజీ జెడ్పీటీసీ భూక్యా నీలామంజీనాయక్, మాజీ సర్పంచ్‌లు భూక్యా నాగునాయక్, భరత్ నాయక్, నాయకులు, గ్రామపెద్దలు భూక్యా రవీందర్‌నాయక్, లోకనాదంనాయక్, గోవర్ధన్‌నాయక్, తులసీరాంనాయక్, రాహుల్ నాయక్, శ్రీనునాయక్, హనుమాన్‌సింగ్, ప్రేమ్‌కుమార్, వీరన్న, పున్నానాయక్, ఈశ్వర్‌నాయక్, మాంగూనాయక్, బజ్జూనాయక్, సత్యనారాయణ, లచ్చీరాం, ఆలీ, సతీష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రజల కష్టాలు



బీటీగా మారనున్న గరిడేపల్లి- వెంకట్రాంపురం రహదారి



గరిడేపల్లి -సర్వారం రోడ్డు

- బీటీగా మారనున్న గరిడేపల్లి నుంచి సర్వారం, వెంకట్రాంపురం వెళ్లే రోడ్లు
- రూ.4.90 కోట్ల నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గరిడేపల్లి : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వరారం గ్రామ ప్రజల కల నెరవేరబోతోంది. గుంతల రోడ్డుపై ఇన్నాళ్లు పడిన కష్టాలు తీరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గరిడేపల్లి నుంచి సర్వారం వరకు బీటీ రోడ్డును మంజూరు చేసింది. ఈమేరకు రూ.4 కోట్ల 40 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అదేవిధంగా గరిడేపల్లి నుంచి వెంకట్రాంపురం వరకు కూడా బీటీ రోడ్డు మంజూరైంది. గత ఎనిమిది ఏళ్ల క్రితం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన సర్వారం, వెంకట్రాంపురం రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో బీటీ రోడ్లు నిర్మించాలని గతంలో అనేకసార్లు ఆయా గ్రామాల ప్రజలు గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. చివరకు రోడ్ల సమస్యను ప్రస్తుత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్ల నిర్మాణానికి రూ. 4 కోట్ల 90 లక్షలు నిధులు మంజూరు చేయించారు. గరిడేపల్లి నుంచి అబ్బిరెడ్డిగూడెం, సుభాష్‌నగర్, లక్ష్మీపురం గ్రామాల మీదుగా సర్వారం వరకు 6.80 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే సర్వారంతో పాటు లింగగిరి, శ్రీనివాసపురం, అమరవరం, పలు గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది. అదేవిధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రానికి ప్రయాణం సులువు కానుంది. అదేవిధంగా గరిడేపల్లి నుంచి వెంకట్రాంపురం వరకు కిలో మీటరు పొడవు గల రోడ్డు నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎన్నో ఏళ్లుగా దెబ్బతిన్న ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్బందులు తొలగనున్నాయి



గరిడేపల్లి నుంచి సర్వారం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషకరం. రోడ్డు నిర్మాణంతో సర్వారంతో పాటు పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు తొలగనున్నాయి. నిధులు మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు. – సాముల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్, సర్వారం

మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు



గరిడేపల్లి నుంచి సర్వారం వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్ల 40 లక్షలు, గరిడేపల్లి నుంచి వెంకట్రాంపురం వరకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు కావడం హర్షణీయం. రోడ్డు నిర్మాణంతో మా ప్రాంత ప్రజల కష్టాలు తొలగనున్నాయి. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు. – త్రిపురం అంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గరిడేపల్లి మండల అధ్యక్షుడు

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు

చిలుకూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యమని, ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చిలుకూరులో జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత తమపైన ఉందన్నారు. అనంతగిరి మండలంలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిపై.. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిండ్రాతి హనుమంతరావు, మాజీ ఎంపీపీలు బజ్జూరి వెంకట్‌రెడ్డి, బొలిశెట్టి నాగేంద్ర బాబు, బండ్ల కోటయ్య, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, నాయకులు వట్టికూటి నాగయ్య, యడవెల్లి పుల్లారావు, రాయభారపు వెంకటేశ్వర్లు, కొండా ప్రభాకర్, రెమిడాల ఆనందరావు, బుడిగెం లింగయ్య, అలసకాని వెంకటయ్య, నాగిరెడ్డి, సొందు మియా, నాగయ్య, చిన్నా, కనకమ్మ, రమేష్, సైదిరెడ్డి, నర్సిరెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

ప్రతి అమావాస్యకు పేదలకు అన్నదానం

హుజూర్‌నగర్ : ప్రతి అమావాస్య నాడు పేదలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని హుజూర్ నగర్ వాసవీ క్లబ్, వనితా క్లబ్ సభ్యులు తెలిపారు. బుధవారం ఆయా క్లబ్‌ల ఆధ్వర్యంలో దాతల సహకారంతో పట్టణంలోని రాఘవేంద్ర సూపర్ మార్కెట్ వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కె.పాపారావు, కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, కోశాధికారి వి.వెంకటేశ్వర్లు వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి ఝాన్సీరాణి, టి.ప్రవళిక, కోశాధికారి కె.లీలా, సభ్యులు నాగేశ్వర రావు, నరసింహారావు, గోపాలకష్ణ, రామారావు, మురళి, కొండల్‌రావు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్, వనితా క్లబ్ సభ్యులు

నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులు, అనాథలకు బుధవారం కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దేవరశెట్టి లింగయ్య జ్ఞాపకార్థం భార్య జగదాంబ, కుమారులు దేవరశెట్టి నాగేశ్వరరావు, దేవరశెట్టి శంకర్‌రావు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అధ్యక్షుడు సేకు శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నదానం పుణ్యకార్యమని అన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ కార్యదర్శి పత్తి నరేందర్, కోశాధికారి వెంపటి ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకురాలు

కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ ఆధ్వర్యంలో..

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రధాన కూడలిలో వాసవీ కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకొని అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సోమప్ప ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్, ఉట్కూరి నటరాజ్, రాచకొండ రవి, రాచకొండ సురేష్, జగిని సురేష్, సత్యం, సత్యనారాయణ, అశోక్, కృష్ణమూర్తి, కోటేశ్వర్‌రావు, కిషన్, మధు, శ్రీను, హరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.



నేరేడుచర్లలో అన్నదానం చేస్తున్న వాసవీ కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ సభ్యులు



మునగాల : వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

నేరేడుచర్ల : ప్రముఖ సినీ నటులు చిరంజీవి, నాగబాబు, పవన్ కళ్యాణ్ కుటుంబంపై అభిమానంతో వారి తల్లి అంజనాదేవి పుట్టిన రోజు సందర్భంగా నేరేడుచర్లలోని స్పందన జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ బట్టు మధు, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, గుండా సత్యనారాయణ, నీలా శ్రీనివాస్, అంజయ్య, కళాశాల అధ్యాపకులు ఆంజనేయులు, శ్రీధర్, ప్రభాకర్, శ్రీను తదితరులు ఉన్నారు.



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడిగా మురళి

కోదాడ : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియా కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడిగా సలిగంటి మురళి నియమితులయ్యారు. బుధవారం కోదాడలో జరిగిన ఆ సంఘం సమావేశంలో మురళీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు గింజల అప్పిరెడ్డి తెలిపారు. జిల్లా బాధ్యుల అనుమతితో త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దాడుల నిరోధక కమిటీ జిల్లా అధ్యక్షుడు బాదె రాము, యూనియన్ నాయకులు అలూగూరి హరినాథ్‌బాబు, ఆవుల మల్లికార్జున్‌రావు, తూములూరి సత్యనారాయణ, పల్లపు శ్రీనివాస్, కోట రాంబాబు, వెంకటరెడ్డి, లంకెల దశరథరామిరెడ్డి, మేకపోతుల వెంకటేశ్వర్లు, దామోదర్, వాసు, నాగరాజు, వెలిశాల శ్రీనివాస్, అ జయ్, కరుణాకర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న సంతోష్‌రెడ్డి

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3.63,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నందిగామ కృష్ణారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన అగ్రిమెంట్‌పై నాన్చివేత ధోరణి సరికాదు



పాల్గొన్న నాగన్నగౌడ్, తదితరులు

హుజూర్‌నగర్ : పార్ బాయిల్డ్ రైస్ మిల్ల్ డ్రైవర్ల నూతన అగ్రిమెంట్ విషయంపై మిల్లర్స్ అసోసియేషన్ వారి నాన్చివేత ధోరణి సరికాదని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురువయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని గోడౌన్స్ ఆవరణలో ఆ యూనియన్ అధ్యక్షుడు సలిగంటి జానయ్య అధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని యధావిధిగా కొనసాగించాలని అన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వీరబాబు, కె.సుబ్బారావు, జి.నాగరాజు, ఎస్.రాజు, ఎం.నరేష్, శ్రీను, ప్రసాద్, బాలకృష్ణ, సీతారాములు, లింగయ్య, జానీపాషా, లక్ష్మీనారాయణ, వీరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నరసింహారావు మృతి సీపీఐకి తీరని లోటు




నరసింహారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : చిలుకూరుకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు కొడారు నరసింహారావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నరసింహారావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శులు సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, నాయకులు కస్తూరి సైదులు, చేపూరి కొండలు, పిల్లుట్ల కనకయ్య, కస్తూరి సత్యం, మండవ అచ్చయ్య, బాలేబోయిన రాంబాబు, కట్టెకోల నాగేశ్వరరావు, బాలేబోయిన రవి, నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

4న రాష్ట్ర స్థాయి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని కానుకమాత చర్చి వార్షికోత్సవం సందర్భంగా చర్చి కమిటీ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న రాత్రి 7 గంటలకు రాష్ట్ర స్థాయి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గ్రూప్ డ్యాన్స్, డ్యూయెట్స్, సింగిల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో నగదు బహుమతితో పాటు షీల్డ్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు.

యూత్ కాంగ్రెస్ కమిటీల ఎన్నిక



పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నడిగూడెం : మండలంలోని బృందావనపురం, చెన్నకేశ్వాపురం గ్రామాల్లో బుధవారం యూత్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ నూతన కార్యవర్గాలను మండల అధ్యక్షుడు గుండు మహేందర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. చెన్నకేశ్వాపురం అధ్యక్షుడిగా శివరాత్రి ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా షేక్.రశీద్, ప్రధాన కార్యదర్శిగా చింత త్రిమూర్తి, కార్యదర్శిగా దార రాజు, కోశాధికారిగా సుంకోజు కరుణాకర్‌చారి, బృందావనపురం అధ్యక్షుడిగా కాసాని శ్రీను, ఉపాధ్యక్షుడిగా పోలంపల్లి చందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మామిడి మహేష్ మరో 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రైతుల అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తా

- ఆర్డీఓ శ్రీనివాసులు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రైతులు తమ అభిప్రాయాలను తెలియజేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం చింతలపాలెంలో ఎంబీసీ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ ఏర్పాటులో భూమిని కోల్పోయే రైతులకు ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తే వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. దీంతో స్పందించిన కొందరు రైతులు తమ భూమికి రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు పరిహారంగా ఇవ్వాలని కోరారు. ఈమేరకు ఆర్డీఓకు రైతులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఆర్ఐ వాసుదేవ రావు, వివిధ పార్టీల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో ఆర్డీఓ సమావేశం

హుజూర్‌నగర్‌రూరల్ : ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ ఏర్పాటుకు గాను భూసేకరణకు బుధవారం మండలంలోని వేపలసింగారంలో బుధవారం రైతులతో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖకు మంచి పేరు తేవాలి

- జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

కోదాడ : వెటర్నరీ ఉద్యోగులు కష్టపడి పనిచేసి పశుసంవర్ధక శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా పశువైద్యాధికారి డి. శ్రీనివాసరావు కోరారు. బుధవారం కోదాడలో జరిగిన కార్యక్రమంలో నాన్ గెజిటెడ్ వెటర్నరీ ఉద్యోగుల సంఘం డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వెటర్నరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.పెంటయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు వెంకటేశ్వరరావు, శేఖర్, చిరంజీవి, రవికుమార్, మధు, సురేంద్ర, శ్రీనివాస్, మురళి, శేషగిరిరావు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నాన్ గెజిటెడ్ వెటర్నరీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు

హుజూర్‌నగర్ : క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయ మనోరి అన్నారు. బుధవారం పట్టణంలోని గోవిందాపురంలో నిక్షయ్ శివర్ కార్యక్రమంలో భాగంగా క్షయ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజువారి మందులతో క్షయ వ్యాధిని సులభంగా తగ్గించవచ్చని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, రాత్రివేళలో జ్వరం, బరువు తగ్గటం, కళ్లలో రక్తపు జీరలు కనబడినట్లయితే క్షయ వ్యాధిగా అనుమానించాలని, వెంటనే పరీక్ష చేయించుకోవాలని ఆమె చెప్పారు. అనంతరం రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి ఉమ, మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పద్మ, సుమిత్ర, మాజీ కౌన్సిలర్ సౌజన్య, వైద్య సిబ్బంది నూర్జహాన్, పద్మ, రమేష్, ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్, లక్ష్మి, వరలక్ష్మి, వెంకన్న ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జయ మనోరి

'ఆదర్శ' విద్యార్థుల విజ్ఞానయాత్ర

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంగళవారం విజ్ఞాన యాత్రకు వెళ్లారు. వరంగల్ పట్టణంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)ను సందర్శించారు. ఈ సందర్భంగా నిట్‌లో ల్యాబ్‌లలో పరిశోధన గురించి శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్ తెలిపారు. అదేవిధంగా వరంగల్‌లోని రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, వరంగల్ ఖిల్లా, భద్రాకాళి దేవాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు.



వరంగల్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్

ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన

మోతె : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మోతె మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం ముందు ఉపాధి హామీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న తమకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించడం లేదని అన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్లు ఉమ్లానాయక్, సురేష్, రామయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాస్, మల్సూర్, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మయ్య, నగేష్, ఉప్పలయ్య, సంధ్య పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

సంక్షిప్త సమాచారం

పాస్టర్ల కమిటీ సమావేశం

హుజూర్‌నగర్ : పాస్టర్ల నియోజకవర్గ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల 3న నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక జీసస్ ప్రార్థన మందిరంలో నిర్వహించిన ఆ సంఘం సీనియర్ పాస్టర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. 3న నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేవిడ్ రాజు, రవికాంత్, సుధాకర్, దేవసహాయం, కృపానందం తదితరులు పాల్గొన్నారు

పేద కుటుంబానికి చేయూత

మునగాల : మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన వెంగళం రాంబాయమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. బీసీ సంక్షేమ సంఘం మునగాల మండల శాఖ అధ్యక్షుడు, స్థానికుడు చింతకాయల నాగరాజు తన కుమార్తె శ్రావ్య పుట్టినరోజు సందర్భంగా రాంబాయమ్మకు బుధవారం రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేసి చేయూత నందించారు. కార్యక్రమంలో తాటికొండ సురేష్, కాశేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశం

మోతె : మండల కేంద్రంలో జనవరి 31న జరిగే బీఆర్‌ఎస్ మండల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు కోరారు. బుధవారం హుస్సేన్‌బాద్ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు ఆరె లింగారెడ్డి నివాసంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

7న 'లక్ష డప్పులు– వేల గొంతుల' సభ

మోతె : సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తెలంగాణలో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు.. వేల గొంతుల సభను విజయవంతం చేయాలని ఎంజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపాటి వెంకన్న, జిల్లా అధికార ప్రతినిధి పల్లెల లక్ష్మణ్ కోరారు. బుధవారం మోతె మండలంలోని బుర్కచర్ల, అప్పన్నగూడెం, రావిపహాడ్ గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు దోసపాటి చిరంజీవి, చిలక వెంకన్న, కె అంజి, వీరబాబు, రావిచెట్టు కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక జీపీలు కైవసం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక గ్రామ పంచాయతీలు కైవసం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. వేల కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధిని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించి ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

'రైతులను మోసం చేయడం తగదు'

నడిగూడెం : రైతు భరోసా పథకాన్ని అన్ని గ్రామాల్లో అమలు చేయాలని బీఆర్‌ఎస్ నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు భోనగిరి ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ రైతులను మోసం చేయడం తగదని పేర్కొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : వరంగల్‌లోని ఐరన్ అండ్ సిమెంట్ సిండికేట్ కార్యాలయంలో ఈనెల 31న జరగనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి ధనుంజయ నాయుడు కోరారు.బుధవారం హుజూర్ నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు సీహెచ్ శ్రీను, వై రమేష్, జె శ్రీనివాస్, జె రమణ పాల్గొన్నారు.

ఎంజేఎఫ్ మండల అధ్యక్షుడిగా సిద్దెల శ్రీను

చిలుకూరు : మాదిగ జర్నలిస్టుల ఫోరం (ఎంజేఎఫ్) చిలుకూరు మండల నూతన కమిటీని బుధవారం స్థానికంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సిద్దెల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కాంపాటి గురవయ్య, ఉపాధ్యక్షుడిగా మల్లెపంగు చిరంజీవి, కోశాధికారిగా నూకపంగు సైదులు, సభ్యులుగా నెమ్మాది వెంకటేశ్వర్లు, మాతంగి సైదులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.